ఉత్సాహంగా.. ఉల్లాసంగా..


కొమ్మాది స్టేడియంలో భోజనం చేస్తున్న క్రీడాకారులు

- కొమ్మాది శాప్ స్టేడియంలో 'ఆడుదాం ఆంధ్ర' మహిళా క్రికెట్ పోటీలు
- ఫైనల్‌కు ఎన్టీఆర్ జిల్లా జట్టు
- ఏర్పాట్లపై క్రీడాకారుల ఆనందం


కొమ్మాది శాప్ స్టేడియంలో క్రీడాకారులకు సూచనలు ఇస్తున్న నిర్వాహకులు


ఫైనల్‌కి చేరిన ఎన్టీఆర్ జిల్లా జట్టు క్రీడాకారులు

మధురవాడ : ఆడుదాం ఆంధ్ర రాష్ట్ర స్థాయి పోటీలు ఉత్సాహంగా.. ఉల్లాసంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా కొమ్మాది శాప్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మూడో రోజు ఆదివారం మహిళా క్రికెట్ పోటీలు హోరాహోరీగా.. ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. ముందుగా తిరుపతి డీఎస్‌డీవో, రాష్ట్ర క్రికెట్ పోటీల ఇన్‌చార్జి షేక్ సయ్యద్ సాహెబ్, విశాఖ జిల్లా సాంఘిక సంక్షేమ గురుకులాల డీసీవో, స్టేడియం వెన్యూ ఇన్‌చార్జి ఎస్.రూపావతి క్రీడాకారులను పరిచయం చేసుకుని, పలు సూచనలు చేశారు. అనంతరం పోటీలు ప్రారంభించారు. మొదటి మ్యాచ్ పల్నాడు – శ్రీకాకుళం జట్ల మధ్య జరగ్గా పల్నాడు విజేతగా నిలిచింది. రెండో మ్యాచ్ అన్నమయ్య – ఎన్టీఆర్ జిల్లాల మధ్య జరగ్గా ఎన్టీఆర్ జిల్లా విజేతగా నిలిచింది. చివరగా మూడో మ్యాచ్ పల్నాడు – ఎన్టీఆర్ జిల్లాల మధ్య హోరాహోరీగా జరగ్గా ఎన్టీఆర్ జిల్లా జట్టు విజేతగా నిలిచి ఫైనల్‌కు చేరిందని నిర్వాహకులు తెలిపారు. పోటీలను నిర్వాహకులు, డ్వామా ఏపీడీ కె.ఆంజనేయులు, ఎస్.సంతోష్ తదితరులు పర్యవేక్షించారు.

క్రీడాకారులకు ఏర్పాట్లు భేష్

రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన సుమారు 1400 మంది మహిళా క్రీడాకారులు, కోచ్‌లు, ఇతర మహిళా సిబ్బందికి మధురవాడ వాంబేకాలనీ సమీపంలోని సుద్దగెడ్డ టిడ్కో కాలనీలో వసతి ఏర్పాటు చేశారు. వీరిలో మహిళలకు కొమ్మాది శాప్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం భోజనం, సాయంత్రం టీ, స్నాక్స్ వంటివి ఇక్కడికే సరఫరా చేస్తున్నారు. ఇక్కడ వసతి ఏర్పాట్లు, భోజనం, సదుపాయాలపై అందరూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఏర్పాట్లన్నీ బాగున్నాయి



మమ్మల్ని స్వస్థలాల నుంచి అధికారులే బస్సుల్లో తీసుకొచ్చి వైజాగ్‌లో వసతి ఏర్పాటు చేశారు. ఇక్కడ భోజనం, తాగునీరు, టిఫిన్, స్నాక్స్ అన్నీ ఏర్పాటు చేశారు. ఏర్పాట్లు చాలా బాగున్నాయి. మేము ఎన్టీఆర్ విజయవాడ జిల్లా నుంచి వచ్చాం. కొండపల్లి ఎస్ఆర్ఐ జూనియర్ కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాను. క్రికెట్ పోటీల కోసం ఇక్కడకు వచ్చాము.

– కె.కీర్తి, క్రికెట్ క్రీడాకారిణి, ఎన్టీఆర్ జిల్లా

భోజనం, వసతి సూపర్



మేము రాష్ట్ర స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలకు పల్నాడు జిల్లా నుంచి ఇక్కడకు వచ్చాం. గుంటూరు పల్నాడు జిల్లా, నాదెండ్ల మండలం, చిరుమామిల్ల ఎస్ఎస్ఆర్ జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్నాను. అధికారులే మమ్మల్ని అక్కడి నుంచి తీసుకొచ్చారు. భోజనం, టిఫిన్ అన్నీ సరిపడినట్లు పెడుతున్నారు. ఏర్పాట్లు చాలా బాగున్నాయి. చాలా ఆనందంగా ఉంది.

– షేక్ నూర్‌మున్నీషా, క్రికెట్ క్రీడాకారిణి, పల్నాడు జిల్లా.

'ఆడుదాం ఆంధ్ర' సభ విజయవంతానికి పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: భీమిలి నియోజకవర్గ పరిధిలోని పీఎం పాలెం అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో ఈ నెల 13న నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర ముగింపు కార్యక్రమం విజయవంతం చేయడానికి అందరూ తరలిరావాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. ఇందుకు సంబంధించి నియోజకవర్గ నాయకులతో ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సిద్ధం తొలి సభను మన నియోజకవర్గంలోనే నిర్వహించారని, ఇది మనందరికీ ఎంతో గర్వకారణమన్నారు. ఇప్పుడు 'ఆడుదాం ఆంధ్ర' ముగింపు కార్యక్రమం కూడా మన ప్రాంతంలోనే నిర్వహించనుండడం చాలా గొప్ప విషయమన్నారు. దీన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపైనా వుందన్నారు. సమావేశంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

యోగా, మెడిటేషన్ థీమ్ పార్కు సిద్ధం


పార్కులో పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన పరికరాలు

- రూ.2.50 కోట్లతో పీఎం పాలెంలో సుందరంగా అభివృద్ధి
- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


పీఎంపాలెంలో ప్రారంభానికి సిద్ధమైన యోగా, మెడిటేషన్ థీమ్ పార్కు

మధురవాడ : జీవీఎంసీ 6వ వార్డు పీఎంపాలెం ఆఖరి బస్టాప్ వద్ద యోగా, మెడిటేషన్ థీమ్ పార్కు ప్రారంభానికి సిద్ధమైంది. ఇక్కడ ఎకరం విస్తీర్ణం గల స్థలంలో రూ.2.50 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దారు. కాంక్రీట్ జంగిల్‌గా మారిపోతున్న నగరంలో ఈ పార్కు ఎంతో సువిశాల పచ్చదనంతో తొణికిసలాడుతోంది. ఇందులో యోగా, మెడిటేషన్‌కి ప్రత్యేక ఏర్పాట్లతో పాటు బుద్ధుని విగ్రహం ఏర్పాటుచేసి, ఆకర్షణీయంగా పెయింటింగ్ చేశారు. మట్టితో రూపొందించిన వాకింగ్ ట్రాక్, సమాంతరంగా సిద్ధం చేసిన మరో వాకింగ్ ట్రాక్ వాకర్స్‌కు ఉపయోగపడనున్నాయి. అవుట్ డోర్ జిమ్, పిల్లలు ఆడుకునే సామగ్రి, బెంచీలు, వాటర్ ఫౌంటెయిన్, మరుగుదొడ్లు, ఎంట్రన్స్ ఆర్చ్ ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. లైటింగ్‌తోపాటు సెక్యూరిటీ కూడా ఏర్పాటు చేశారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దిన ఈ పార్కును సోమవారం సాయంత్రం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించనున్నారు. ఇందుకోసం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జీవీఎంసీ ఏఈ సురేష్ చెప్పారు.

క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలు వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

ఘనంగా ఆత్మార్పణ దినోత్సవం


ప్రత్యేక అలంకరణలో వాసవి కన్యాకాపరమేశ్వరి అమ్మవారు

భీమునిపట్నం: భీమిలిలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద ఆదివారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బొండా నర్సింహమూర్తి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేయగా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు.

పోలమాంబ ఆలయం చుట్టూ దేవుళ్ల విగ్రహాలు


వినాయకుని విగ్రహం వద్ద చిట్టివలస వాసులు

తగరపువలస : చిట్టివలస పోలమాంబ ఆలయం చుట్టూ స్థానిక దాతలు ఆదివారం వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్ప స్వామి, ఆంజనేయుడు, ఇతర అమ్మవార్ల విగ్రహాలు ప్రతిష్ఠించారు. వీటిని అర్చకులు పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో విగ్రహ దాతలు కాళ్ల సూర్య పురుషోత్తం, బింగి హరికిరణ్‌రెడ్డి, బంగారు పరదేశి, సరగడ నరసింగరావు, పిన్నింటి నరసింహులు, జీరు రాము, చిల్ల ఆదెమ్మ, చిల్ల సూర్యనారాయణమూర్తి, చిల్ల రామసూరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో గావ్ చలో అభియాన్


పాండ్రంగిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ మాధవ్

పద్మనాభం : బీజేపీ గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మాజీ ఎమ్మెల్సీ పి.మాధవ్ మండలంలోని పాండ్రంగి, రేవిడి పంచాయతీల్లో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఇంటింటా ప్రచారం చేశారు. కులమతాలకు అతీతంగా ప్రధాని నరేంద్ర మోడీని గెలిపించుకోవాలని కోరారు. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈయన వెంట భీమిలి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి కంటుభుక్త రామానాయుడు, ప్రధాన కార్యదర్శి మహంతి శ్రీను, రూపాకుల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రవికుమార్ తదితరులు ఉన్నారు. కృష్ణాపురం పంచాయతీలో డి.శ్రీనివాసరావు ఇంటింటా ప్రచారం చేశారు.

ఘనంగా 'కేథరిన్' వార్షికోత్సవాలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

తగరపువలస: భీమిలి కేథరిన్ విద్యా సంస్థల 40వ వార్షికోత్సవాలు ఆదివారం చిట్టివలస బంతాట మైదానంలో ఘనంగా ముగిశాయి. విద్యా సంస్థల వ్యవస్థాపకుల్లో ఒకరైన ప్రొఫెసర్ ఆర్‌డీ రతన్‌రాజు, చైర్మన్ ఆలీవర్ ఆర్ రాయి మాట్లాడుతూ భీమిలిలో మొట్టమొదటి ఇంగ్లిష్ మీడియం విద్యా సంస్థ ఏర్పాటు చేయడానికి గల కారణాలు వివరించారు. తమను ఇంతలా ఆదరించిన ఈ ప్రాంత ప్రజల ఆదరాభిమానాలు మరిచిపోలేమన్నారు. పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ యాజమాన్యం పరిపాలన దక్షతతోనే తాము జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు రకాల నృత్యాలు ప్రదర్శించారు. సాహస కృత్యాలు, పిరమిడ్లను బాలబాలికలు వేదికపై చేసి చూపించారు. అనంతరం విద్యార్థులు, సిబ్బందికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు.

ముగిసిన హిందీ పరీక్షలు


నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

తగరపువలస : దక్షిణ భారత హిందీ ప్రచార సభ ద్వారా రెండు రోజులపాటు నిర్వహించిన హయ్యర్, లోయర్ పరీక్షలు ఆదివారంతో ముగిశాయి. భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు ఎం.తిరుమల శ్రీదేవి ఆధ్వర్యంలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మధ్యాహ్నం హయ్యర్ విద్యార్థులకు నగరం నుంచి వచ్చిన ప్రత్యేక అధ్యాపకురాలు వైవా నిర్వహించారు. ఈ పరీక్షలకు నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్ ఉపాధ్యాయులు ఇన్విజిలేటర్లుగా వ్యవహరించారు.

సింహాచలేశునికి స్వర్ణ సంపెంగార్చన


స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు


నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

నేత్రపర్వంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు శాస్త్రోక్తంగా జరిగాయి. అందులో భాగంగా స్వామివారికి ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన చేశారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

ఘనంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

అందరూ రక్తదానం చేయాలి


రక్తదానం చేస్తున్న సభ్యులు

భీమునిపట్నం: రక్తదానం చేయడం ప్రతీ ఒక్కరి బాధ్యతని విశాఖ హార్బర్ ప్రాంత ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్ అన్నారు. స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కలిగొట్ల శ్రీదేవి జయంతి సందర్భంగా ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రోగుల ప్రాణాలు కాపాడేందుకు రక్తం ఎంతో అవసరమన్నారు. అటువంటి వారికి సాయపడేందుకు ఎటువంటి అపోహలు లేకుండా రక్తదానానికి అందరూ ముందుకు రావాలని కోరారు. అనంతరం డీవీస్ సంస్థ ఉద్యోగులు, ఫౌండేషన్ సభ్యులు 75 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో సభ్యులు కలిగొట్ల సూర్యనారాయణమూర్తి, భానోజీరావు, శ్రీనివాసరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మాతృభాషపై ఆసక్తి పెంపొందించడమే సుపథ లక్ష్యం


బహుమతులు, సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

తగరపువలస : విద్యార్థులకు మాతృభాషపై ఆసక్తి పెంపొందించడంతోపాటు సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణ, మానవతా విలువలు పెంపొందించడానికి సుపథ సంస్థ 20 ఏళ్లుగా కృషి చేస్తోందని ఆ సంస్థ వ్యవస్థాపకుడు యూవీఏఎస్‌రాజు అన్నారు. పద్మనాభం గోస్తనీ విద్యాపీఠ్‌లో ఆదివారం నిర్వహించిన ప్రతిభ పరీక్షల్లో 17 పాఠశాలలకు చెందిన 452 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం ఎంపీపీ కె.రాంబాబు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఇలాంటి సంస్కారాలు నేర్పించడం ద్వారా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవచ్చన్నారు. తెలుగులో రామాయణంపై ప్రజలకు వివరించిన భాష్యం అప్పలాచార్యులు జన్మించిన పద్మనాభం ఎంతో ప్రఖ్యాతి పొందిందన్నారు. పద్య పఠనం, శ్లోక పఠనం, తెలుగు నేర్చుకుందాం, గేయాలు, రామాయణం, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సహాయ కార్మిక శాఖాధికారి ఎల్లాజీరావు, ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి, పద్దు సత్యనారాయణ బహుమతులు అందించారు. కార్యక్రమంలో యు.వి.ఎ.ఎస్.రాజు, ఎ.వి.ఆర్.శర్మ, ఎ.దేముడు, టి.ఎర్రయ్య, కె.శ్రీను, ఎస్.రాము తదితరులు పాల్గొన్నారు.

ఏసు క్రీస్తు బోధనలు అనుసరణీయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : ప్రపంచ మానవాళి మేలు కోరి ఏసు క్రీస్తు చేసిన బోధనలు అనుసరణీయమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఆనందపురం జంక్షన్‌లోని స్వస్థత నీడ మందిరంలో ఆదివారం నిర్వహించిన పర్ణశాలల పండగలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అణిచివేతకు గురైన వారిని బానిసత్వ బతుకుల నుంచి విడిపించిన మహనీయుడు ఏసుక్రీస్తు అని చెప్పారు. ఏసు ప్రభువు అందరివాడని, అతని బోధనలో ముఖ్యమైన ప్రేమ, కరుణ, జాలి, క్షమాపణ గుణాలను అందరూ కలిగి ఉన్ననాడు సమాజంలో శాంతి నెలకొంటుందని చెప్పారు. కార్యక్రమంలో వివిధ క్రైస్తవ సంఘ నాయకులు, దేవ సేవకులు, మతాధిపతులు, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.2.12 లక్షల విరాళం



అన్నప్రసాదానికి విరాళాలు అందజేసిన దాతలకు బాండ్లు అందజేస్తున్న ఏఈవో నరసింగరావు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సింహాచలం దరి ప్రహ్లాదపురం ప్రాంతానికి చెందిన పిల్లా భాస్కరరావు దంపతులు రూ.1,01,116లు, మర్రిపాలెం ప్రాంతానికి చెందిన ఎం.సీతాపతిరావు రూ.1,11,111లు విరాళంగా అందజేశారు. సింహగిరికి కుటుంబ సమేతంగా వచ్చిన దాతలు సంబంధిత విరాళాలను నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరఫున దాతలకు అన్నప్రసాదం పథకం ఏఈవో పాలూరి నరసింగరావు బాండ్‌లు అందజేశారు.

ప్రజావసరాల కోసమే చదును చేయించాం..


ఈనాడు తప్పుడు వార్తను ప్రచురించిందని ఖండిస్తున్న సత్యసాయినగర్ కొండవాలు ప్రజలు

- స్వార్థ ప్రయోజనాల కోసమే తప్పుడు రాతలు
- 'ఈనాడు' వార్తను ఖండించిన సత్యసాయినగర్ వాసులు

తాటిచెట్లపాలెం: 'జీవీఎంసీ 45వ వార్డు సత్యసాయి నగర్ కొండవాలు ప్రాంతంలో అధికార పార్టీకి చెందిన నాయకుల అండదండలతో కొండను తొలిచేసి కబ్జా చేస్తున్నట్లు ఈనాడు దినపత్రికలో వచ్చిన వార్త పూర్తిగా అవాస్తవం. కేవలం ఒకరిద్దరి స్వార్థ ప్రయోజనాల కోసమే ఈ వార్తను రాశారు' అని సత్యసాయినగర్ వాసులు ముక్తకంఠంతో ఖండించారు. ఈనాడు ప్రతులతో ఆదివారం వీరంతా ఇక్కడ నిరసన చేపట్టారు. సత్యసాయినగర్ కొండ ప్రాంతంలో చెత్త, పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో విషసర్పాలు వస్తున్నాయని, ఈ స్థలం ప్రజావసరాల కోసం వినియోగించుకునేందుకు అనుమతులు ఇప్పించాలని కాలనీవాసులంతా భీమిలి ఎమ్మెల్యేను కలిసి విన్నవించుకున్నామన్నారు. ఈ క్రమంలో స్థలాన్ని శుభ్రం చేయించుకుంటుంటే.. కేవలం ఒకట్రెండు కుటుంబాలు దీనిని అడ్డుకుని, తప్పుడు వార్తలు రాయించారని స్థానిక మహిళలు దుయ్యబట్టారు. తామంతా కొండ మీద నివసిస్తున్నామని, ఏదైనా పూజలు జరిగినా, ఎవరైనా చనిపోయినా, వాహనాల పార్కింగ్ వంటి వాటికి చాలా ఇబ్బందిగా ఉందని, దీనికోసమే ఈ స్థలాన్ని చదును చేయించామని తెలిపారు. ప్రజావసరాల కోసం తామే శుభ్రం చేసుకున్నామని, తమ వెనుక ఏ రాజకీయ పార్టీ నాయకులు లేకరి స్పష్టం చేశారు.

పీవీ నరసింహారావుకు ఘన నివాళి

తగరపువలస : మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారంతో గౌరవించడం సముచితమని ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు అన్నారు. ఆదివారం పీవీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆ మహనీయుని చరిత్రను విద్యార్థులకు వివరించారు. 18 భాషల్లో పీవీకి ప్రవేశం వుందని, 10 భాషల్లో అనర్గళంగా మాట్లాడగలరని తెలిపారు. విశ్వనాథ సత్యనారాయణ వేయిపడగలు గ్రంథాన్ని హిందీ, ఇంగ్లిష్, మరాఠీ భాషల్లోకి అనువదించారని గుర్తు చేశారు. 1991లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టారన్నారు.


పీవీ నరసింహారావు చిత్రపటానికి నివాళులర్పించే కార్యక్రమంలో ఆదర్శ హిందీ ప్రేమీ మండలి విద్యార్థులు, ప్రతినిధులు

సూర్య దేవునికి విశేషంగా పూజలు


ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణ స్వామి

సింహాచలం : మాఘ మాసంలో తొలి ఆదివారంను పురస్కరించుకుని సింహాచలం దేవస్థానంకి చెందిన శ్రీకృష్ణాపురం గోశాల సమీపంలోని సప్త అశ్వవాహన సమేత సూర్యానారాయణ స్వామిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. సూర్య నమస్కారాలు చేశారు. ఆదిత్య పఠన పారాయణ చేశారు.